## బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయాలి

కరీమాబాద్, నవంబర్ 5: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అంబాల ఉదయ్‌కిరణ్ అన్నారు. మామునూరులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. వర్ధన్నపేటలో ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు లక్ష మెజారిటీ వచ్చేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో స్పందన్, దోమ రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఉదయ్‌కిరణ్

## జీవంజి దీప్తికి రూ.లక్ష చేయూత




రూ.లక్ష చెక్కు అందుకుంటున్న దీప్తి

పర్వతగిరి, నవంబర్ 5: మండలంలోని కల్లెడకు చెందిన క్రీడాకారిణి జీవంజి దీప్తి పారా ఆసియా గేమ్స్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించగా ఎన్ఈబీ స్పోర్ట్స్ నేతృత్వంలో ఆదివారం రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఏఎఫ్ఐ అధ్యక్షుడు అదిల్ సుమారివాలా, జాతీయ చీఫ్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభను కనబరిచిన దీప్తిని అభినందించారు.

## ఎరుకల ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు

కాశీబుగ్గ, నవంబర్ 5: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన ఎరుకల ఆత్మగౌరవ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతిరి రాజశేఖర్, పల్లకొండ ప్రభాకర్, లోకిని సమ్మయ్య, మానుపాటి రమేశ్, రంజిత్ కుమార్, దుగ్యాల రాములు, పల్లకొండ యాదగిరి, ఓని రమేశ్ పాల్గొన్నారు.



మైనారిటీలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న అరూరి రమేశ్



కాశీబుగ్గ: ఎస్ఆర్ నగర్‌లో గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే అరూరి

# బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

- కాంగ్రెస్‌వి ఆచరణ సాధ్యం కాని హామీలు
- ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలి
- ఎమ్మెల్యే అరూరి రమేశ్
- 55, 56 డివిజన్లలో ఇంటింటా ప్రచారం

హసన్‌పర్తి, నవంబర్ 5: బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గ్రేటర్ 55, 56 డివిజన్ల పరిధిలోని గోపాల్‌పూర్, పూరిగుట్ట, జవహర్‌కాలనీ, కోమటిపల్లిలో ఎమ్మెల్యే అరూరి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు మంగళహారతులు, కోలాటాలు, బతుకమ్మలతో ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ కారుగుర్తుకు ఓటువేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇప్పటివరకు రూ.160 కోట్లతో చేసిన అభివృద్ధి వారికి వివరించారు. ఎన్నో ఏడ్లు పరిపాలించిన కాంగ్రెస్ హయాంలో నీళ్లు, ఉచిత కరెంట్ ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే వారంటీ లేని గ్యారంటీలను ప్రజలు నమ్మొద్దని కోరారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. వారికి డిపాజిట్లు రాకుండా ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా ఆదరిస్తే ఎప్పుడూ అందుబాటులో ఉండి కేసీఆర్, కేటీఆర్ సహకారంతో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. కార్పొరేటర్లు జక్కుల రజితా వెంకటేశ్వర్లు, సిరంగా సునిల్, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రుద్రోజు మణీంద్రనాథ్, ఎర్రగట్టు ఆలయ చైర్మన్ చింతల లక్ష్మణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీను, నాయకులు సాంబయ్యనాయక్, ఉపాధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

నయీంనగర్/కాశీబుగ్గ: గ్రేటర్ 43, 44వ డివిజన్లలోని పెన్షన్‌పూర్. లక్ష్మీపూర్‌లో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ ఓబీసీ అధికార ప్రతినిధి ఆడెపు అనిల్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఆడెపు అశోక్, సీపీఐ మాజీ వార్డు సభ్యురాలు హైమావతి, సునితతో ఇతరులకు ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. చేరిన వారికి సముచిత స్థానం కల్పించి, కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పనిచేయాలని, తెలంగాణ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్పొరేటర్ చింతల యాదగిరి, మాజీ వార్డు సభ్యులు హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు కేతిరి రాజశేఖర్, ముడుసు నరసింహా, పసులాది మల్లయ్య, కేతిరి సమ్మక్క, పున్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం

వర్ధన్నపేట, నవంబర్ 5: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారంలో కౌన్సిలర్ తుమ్మల రవీందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సిలువేరు కుమారస్వామి కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నర ఏళ్లలోనే వర్ధన్నపేట పట్టణం, మండలంలోని గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం రాకముందు గ్రామాలు, పట్టణ ప్రజలు తాగు నీటిని తీవ్ర ఇబ్బందికి గురయ్యేవారని పేర్కొన్నారు. దూర ప్రాంతంలో ఉన్న వ్యవసాయబావుల నుంచి మహిళలను తాగునీటిని తెచ్చుకున్న ఘటనలు ఉండేవని గుర్తుచేశారు. తాగునీటి కోసం మహిళలు, సాగునీటి కోసం రైతులు నిత్యం రహదారులపై రాస్తారోకోలు చేసేవారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా దక్షతతో రైతులకు సాగునీటితో పాటు 24గంటల ఉచిత విద్యుత్, గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సాగునీరు అందుతోందన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు మంచి జరగాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. పార్టీ ముఖ్యనాయకులు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'అభివృద్ధి'కి పట్టం కట్టాలి

హసన్‌పర్తి: ప్రజలు అభివృద్ధి చేసే నాయకుడికి పట్టం కట్టాలని ఎంపీపీ కేతపాక సునీత అన్నారు. మండలంలోని మడిపల్లిలో అరూరి రమేశ్ గెలుపుకోసం ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అరూరి రమేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపిస్తే దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తారని తలిపారు. జడ్పీటీసీ రేనుకుంట్ల సునీత, పాక్స్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ జడ్పీటీసీ సుభాశ్‌గౌడ్, ఎంపీటీసీ ఇంద్రయ్య, ఉప సర్పంచ్ రంజిత్, మండల యూత్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు బుర్ర రాజు, నాయకులు ఎల్లయ్య పాల్గొన్నారు.



పర్వతగిరి: ప్రచారం చేస్తున్న సర్పంచ్ మాలతీ సోమేశ్వర్‌రావు

### పంట చేలలో ప్రచారం

పర్వతగిరి: మండల కేంద్రంతోపాటు చౌటపెల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ కమల పంతులు, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతీ సోమేశ్వర్‌రావు, ఎంపీటీసీ మాడ్గుల రాజు, మాజీ ఎంపీపీ రంగు రజిత, పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, మేడిశెట్టి రాములు, గోనె సంపత్, ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, చౌటపెల్లి ఎంపీటీసీ మిట్టపెల్లి లావణ్య ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. పంట చేల వద్దకు వెళ్లి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. మహిళా నాయకులు విజయ పాల్గొన్నారు.

## 18న వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

కాశీబుగ్గ, నవంబర్ 5: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎన్నికలు ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మడూరి వేదప్రకాశ్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న చాంబర్ సర్వసభ్య సమావేశం నిర్వహించి ఆమోదం పొందిన తర్వాత మూడేండ్ల కోసం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9న ఉదయం నుంచి సాయంత్రం వరకు నామినేషన్ల దాఖలు, 10న మధ్యాహ్నం వరకు నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం పోటీ అభ్యర్థుల తుదిజాబితా, 18న శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ నిర్వహించి రాత్రి ఓట్ల లెక్కింపు చేసి విజేతలను ప్రకటిస్తామని ఎన్నికల నిర్వహణ అధికారి చకిలం ఉపేందర్ తెలిపారు.

### మెకానిక్ షెడ్‌లోకి దూసుకెళ్లిన కారు

వర్ధన్నపేట, నవంబర్ 5: కారు అదుపుతప్పి బైక్ మెకానిక్ షెడ్‌లోకి దూసుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కనున్న మెకానిక్ షెడ్‌లోకి వేగంగా దూసుకెళ్లింది. దీంతో షెడ్‌లో ఉన్న పలు బైక్‌లు ధ్వంసమయ్యాయి. షెడ్ కూడా పాక్షికంగా దెబ్బతిన్నది. కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు కావడంతో వారిని వరంగల్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి సమయంలో షెడ్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వర్ధన్నపేట 10వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



హసన్‌పర్తి: పడిపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ సునీత, బీఆర్ఎస్ శ్రేణులు



పర్వతగిరి: కూలీలను కలిసి ఓటు అడుగుతున్న ఎంపీపీ కమల, మాజీ ఎంపీపీ రజిత గౌడ్, ఎంపీటీసీ లావణ్య